
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
మంగళవారం 9 జూలై 2024



• రాజశేఖరరెడ్డికి నివాళి

దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి కార్యక్రమం మంగళగిరిలోని సీకే ఫంక్షన్ హాలులో సోమవారం జరిగింది. తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, సీపీఐ నేత నారాయణ, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల, కేవీపీ రామచంద్రరావుతోపాటు పలువురు కాంగ్రెస్ నేతలు వైఎస్‌కు నివాళి అర్పించారు.



తెలంగాణా సీఎం రేవంత్‌రెడ్డికి జ్ఞాపికను అందిస్తున్న షర్మిల



పవిత్ర సంగమం వద్ద కృష్ణా - గోదారమ్మలకు జలహారతి ఇస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే రాము, దేవినేని ఉమా

పట్టిసీమతో సిరుల సీమగా కృష్ణాడెల్టా

జలవనరులశాఖ మంత్రి రామానాయుడు

ఇబ్రహీంపట్నం, జూలై 8 : పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా డెల్టాను సిరుల సీమగా మార్చి డెల్టా ప్రజలను వలస కష్టాల నుంచి బయటపడేసే దార్శనికుడు సీఎం చంద్రబాబు అని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కొనియాడారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణమ్మలో కలిసిన గోదావరి జలాలకు ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పవిత్రసంగమం వద్ద ఆయన సోమవారం మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, స్థానిక టీడీపీ నాయకులతో కలిసి వేద పండితుల మంత్రోచ్ఛ రణల మధ్య పూలు జల్లి చీరె సారె సమర్పించి జలహారతి ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ 24 పంపుల్లో 17 పంపుల ద్వారా 6,100 క్యూసెక్కుల నీరు అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. 2015 - 19 మధ్య కాలంలో 30 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తే రైతులకు రూ.50 వేల కోట్ల ఆదాయం సమకూరిందంటే అసలైన సంపద సృష్టి ఎలా జరిగిందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, రామినేని రాజశేఖర్ (రాజా), చెన్నుబోయిన చిట్టిబాబు, చనమోలు నారాయణ, షైలా సైదులు, రావి ఫణి, పీతా శ్రీనివాసరాజు, ఈఎన్‌సీ సి.నారాయణ రెడ్డి, సలహాదారులు వెంకటేశ్వరరావు, ఎస్ఈలు టీజేహెచ్ ప్రసాదబాబు, ఉమామహేశ్వరరావు, వి.వి.ఆర్ కృష్ణారావు, పాల్గొన్నారు.



ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది (ఇన్‌సెట్‌లో) ఆక్రమణల తొలగింపునకు ముందు



ఆక్రమణల తొలగింపు

• గుడివాడలో ఆక్రమణపై అధికారుల చర్యలు

కొత్త మున్సిపల్ కార్యాలయం ఎదురుగా గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకుల అండదండలు, ప్రోద్బలంతో చింతలకోడు డ్రైన్‌పై సుమారు 25 షాపులు అక్రమంగా వెలిశాయి. సిల్ట్ తొలగింపు సమయంలో కూడా వారి ఆక్రమణలు తొలగించకుండా ఆనాటి వైసీపీ నాయకులు చక్రం తిప్పారు. ఆక్రమణలు తొలగించేందుకు వెళ్లిన మున్సిపల్ అధికారులకు మాజీ మంత్రి కొడాలి నాని కార్యాలయం నుంచి బెదిరింపు కాల్స్ చేయించారు. వైసీపీ నాయకుడు యార్లగడ్డ మురళీకృష్ణకు చెందిన కూరగాయల దుకాణం విషయంలో ఆనాటి మాజీ మంత్రి కొడాలి నాని పీఏ ఆచంట లక్ష్మీజీ రంగంలోకి వచ్చి ఫోన్‌లోనే అధికారులను బెదిరించారు. దీంతో అధికారులు వెనక్కి తగ్గారు. పూర్తిస్థాయిలో సిల్ట్ తొలగింపు జరగక, మురుగునీరు పారుదల కాక పల్లపు ప్రాంతాలు నీటమునుగుతున్నాయి. ప్రభుత్వం మారింది. కూటమి అధికారంలోకి వచ్చింది. వైసీపీ నేతల ఆగడాలకు చెక్ పడింది. సిల్ట్ తొలగింపుతోపాటు ఆక్రమణలను పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు, సచివాలయ సిబ్బంది దగ్గరుండి తొలగిస్తున్నారు. వైసీపీ నాయకుడు యార్లగడ్డ మురళీకృష్ణ ఆధీనంలో ఉన్న కూరగాయల దుకాణాన్ని తొలగించేశారు. మిగిలిన ఆక్రమణదారులు ప్రతిఘటించకుండా స్వచ్ఛందంగా ఆక్రమణల తొలగింపునకు సహకరించారు. - గుడివాడ

స్టాక్ ఖాళీ!

జిల్లాలోని స్టాక్‌పాయింట్లలో ఇసుక నిల్వలు శూన్యం

ఎన్నికల ఫలితాలకు ముందే ఖాళీ చేసిన శాండ్ మాఫియా



- ప్రభుత్వం అనుమతి ఇస్తేనే రీచ్‌లలో తవ్వకాలు
- ఆ తరువాతే స్టాక్ పాయింట్లకు తరలింపు
- నాలుగైదు రోజుల్లో స్పష్టత వస్తుంది : కలెక్టర్

రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని సోమవారం నుంచి అమల్లోకి తెచ్చినా జిల్లాలో ఇప్పట్లో ఇసుక అందుబాటులోకి వచ్చే సూచనలు కనిపించడం లేదు. ప్రభుత్వం మారుతుందనే ముందస్తు అంచనాలతో వైసీపీ నేతలు స్టాక్ పాయింట్ల నుంచి ఇసుకను ఖాళీ చేశారు. దీంతో స్టాక్ పాయింట్లు ఖాళీ అయ్యాయి. రేవుల నుంచి స్టాక్‌పాయింట్ల వద్దకు ఇసుకను తరలించాలంటే ప్రభుత్వ అనుమతి కావాలి. జూలై నుంచి అక్టోబరు వరకు కృష్ణానదిలోని రేవుల నుంచి ఇసుకను తవ్వి తీసేందుకు అనుమతులు లేవని, ప్రభుత్వం ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బాలాజీ పేర్కొన్నారు. దీన్ని బట్టి ఇప్పట్లో జిల్లా వాసులకు ఉచిత ఇసుక అందుబాటులోకి రావడం సాధ్యపడదన్నమాట.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో కృష్ణానదీ పరివాహక ప్రాంతం వెంబడి పెనమలూరు, పామర్రు, అవనిగడ్డ నియోజకవర్గాలు ఉన్నాయి. పెనమలూరు నియోజకవర్గం పరిధిలో చోడవరం, మద్దూరు, యనమలకుదురు, పెదపులిపాక రేవుల నుంచి ఇసుకను తవ్వేవారు. చోడవరం వద్ద స్టాక్ పాయింట్ నుంచి ఇసుకను విక్రయించేవారు. పామర్రు నియోజకవర్గం పమిడిముక్కల మండలం లంకపల్లి, ఘంటసాల మండలం శ్రీకాకుళం, పాపవినాశనం రేవుల నుంచి ఇసుకను తవ్వేవారు. శ్రీకాకుళం వద్ద ఏర్పాటు చేసిన ఇసుక పాయింట్ ద్వారా ఇసుకను విక్రయించేవారు.

• ముందస్తుగానే ఖాళీ చేసి..

అన్ని రీచ్‌లలో కూలీలతో పనిలేకుండా యంత్రాలతోనే తవ్వేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత జేపీ కంపెనీ పేరుతో, ఎన్నికలకు ముందు వీసీకేసీ సంస్థ పేరుతో ఇసుకను తవ్వి విక్రయాలు జరిపారు. తెరపైన ఈ రెండు సంస్థల పేర్లుచెప్పినా ఇసుక తవ్వకాల వ్యవహారాలు మొత్తం స్థానిక వైసీపీ శాసనసభ్యులు, వారి అనుచరుల కనుసన్నల్లోనే నడిచేవి. జిల్లాలోని స్టాక్‌పాయింట్లలోని ఇసుక మొత్తాన్ని నూతన ప్రభుత్వం బాధ్యతలు చేపట్టే నాటికే ఖాళీ చేసేశారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలులో భాగంగా ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని చూసినా జిల్లాలోని స్టాక్ పాయింట్లలో ఒక్క టన్ను ఇసుక కూడా అందుబాటులో లేకపోవడం గమనార్హం. ఎన్టీఆర్ జిల్లాలోని స్టాక్ పాయింట్ల నుంచి ఇసుకను తెచ్చుకోవాల్సి ఉండటంతో రవాణా చార్జీల రూపంలో జిల్లా ప్రజలపై కొన్నిరోజుల పాటు కొంతమేర ఆర్థిక భారం పడనుంది.

అనధికారిక ఇసుక తవ్వకాలకు అడ్డేలేదు

అవనిగడ్డ నియోజకవర్గం మోపిదేవి మండల పరిధిలోని బొబ్బర్లంక, కే-కొత్తపాలెం రేవుల నుంచి ఇసుకను ఎడ్లబండ్ల ద్వారా, రాత్రి సమయాల్లో ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ అనధికారికంగా ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్లలో నిల్వ ఉంచుతారు. ఇసుకను తరలించుకుపోయేందుకు లారీలను రప్పించి తెల్లారేసరికి స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వలను విక్రయించేస్తారు. మోపిదేవి మండలం కోసూరివారిపాలెం సమీపంలోని ఇసుకరేవులో సముద్రపు పోటు వచ్చే సమయంలో నదిలో నీరు ఉంటుంది. సముద్రపు ఆటు సమయంలో ట్రాక్టర్లు నడిచేందుకు అవకాశం ఉంటుంది. సముద్రపుపోటు తగ్గగానే ఇక్కడ ఇసుక తవ్వకాలను జోరుగా కొనసాగిస్తున్నారు. పెదకళ్లేపల్లి వద్ద నదిలోని నీటిలో నుంచి ఇసుకను తీసి పడవల ద్వారా స్టాక్ పాయింట్లకు తరలించి లారీలు వచ్చిన వెంటనే లోడ్‌చేసి ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించేస్తున్నారు. అవనిగడ్డ మండలం యడ్లంకలో గతంలో ఇసుక తవ్వకాలు జోరుగా కొనసాగించారు. స్థానికులు అడ్డుకోవడంతో ఇక్కడి నుంచి ఇసుక అక్రమ రవాణాను తాత్కాలికంగా నిలిపివేశారు.

స్టాక్ పాయింట్లలో ఇసుక లేదు..

జిల్లాలో స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వలు ప్రస్తుతం ఎక్కడా లేవు. గతంలో పనిచేసిన స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వలను ఖాళీ చేశారు. జూలై నుంచి అక్టోబరు వరకు కృష్ణానదిలో ఇసుక తవ్వి తీసేందుకు అనుమతులు లేవు. ఇసుక కావాల్సిన వారు ఎన్టీఆర్ జిల్లాలోని స్టాక్‌పాయింట్ల వద్దకు వెళ్లి ప్రభుత్వం నిర్దేశించిన నామమాత్రపు సీనరేజీ, రవాణా, లోడింగ్ చార్జీలు చెల్లించి తెచ్చుకోవాల్సిందే. నాలుగైదు రోజుల్లో జిల్లాలో ఉచిత ఇసుక విధానాన్ని అమలు పరిచేందుకు అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, సాధ్యాసాధ్యాలను పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటాం.

- డీకే బాలాజీ, కలెక్టర్

ఉచిత ఇసుక విధానం అభినందనీయం

వైసీపీ ఇసుక అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలి

- విభజన పంపకాల్లో రాష్ట్రానికి న్యాయం జరగాలి
- ప్రత్యేక హోదా తెచ్చే పార్టీతో కలిసి పనిచేస్తాం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

6లో..

తొలుత తాగునీరు..



ఆ తర్వాతే సాగు నీరు విడుదల

- తూర్పు, పశ్చిమ డెల్టాలో తాగునీటికి మొదటి ప్రాధాన్యం
- ప్రకాశం బ్యారేజీకి చేరిన 'గోదావరి'
- రెండు డెల్టాల కాల్వలకు రేపు తాగునీరు విడుదల
- 'తూర్పు'లో 547... 'పశ్చిమ'లో 127 చెరువులు
- చెరువుల్లో కనిపించని చుక్కనీరు
- పది రోజులపాటు తాగునీటి అవసరాలకు విడుదల

తాగునీటి అవసరాలు తీరుస్తారా? సాగునీటిని విడుదల చేసి సహకరిస్తారా? జలవనరుల శాఖ అధికారుల ముందు ఉన్న ప్రశ్న ఇది. పట్టిసీమ ద్వారా గోదావరి జలాలు కృష్ణా నదికి చేరడంతో అవసరాలు కత్తిమీద సాములా మారుతున్నాయి. అటు పులిచింతల ప్రాజెక్టులోనూ, ఇటు ప్రకాశం బ్యారేజీలోనూ నీటి నిల్వలు అంతంతమాత్రంగా ఉన్నందున పైనుంచి వస్తున్న పట్టిసీమ నీటితో ఈ నీటి సంవత్సరాన్ని ముందుకు నడిపించాలని అధికారులు భావిస్తున్నారు. గోదావరి జలాలు సోమవారం ప్రకాశం బ్యారేజీని తాకాయి. దీంతో తొలుత కాలువల ద్వారా తాగునీటిని విడుదల చేయాలని జలవనరుల శాఖ అధికారులు నిర్ణయించారు. పది రోజులపాటు ఈ ప్రణాళికను అమలు చేయాలని భావిస్తున్నారు. ఇది పూర్తయిన తర్వాత సాగునీటి అవసరాలకు ప్రణాళికలను రూపొందించాలన్న ఆలోచనలో అధికారులు ఉన్నారు.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : ప్రతి ఏడాదీ ప్రకాశం బ్యారేజీ నుంచి తూర్పు ప్రధాన, పశ్చిమ ప్రధాన కాలువ ద్వారా జూన్‌లోనే తాగు, సాగు నీటిని విడుదల చేసేవారు. గడచిన నీటి సంవత్సరంలో ఎల్‌నినో ప్రభావంతో ఈ ప్రణాళిక మొత్తం పటాపంచలైంది. తాగునీటి, సాగునీటి అవసరాలకు వేర్వేరుగా నీటిని విడుదల చేశారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చెరువులను నింపుకోవడానికి నీటిని ఇచ్చారు. తూర్పు డెల్టా కాల్వల కింద 547 చెరువులు ఉన్నాయి. ఈ చెరువులన్నీ కృష్ణా జిల్లాలో ఉన్నాయి. పశ్చిమ డెల్టా కాలువ కింద 127 చెరువులు ఉన్నాయి. వర్షాకాలం ప్రారంభం నుంచి ఈ చెరువులన్నీ నిండుకుండలా ఉండేవి. ఎల్‌నినో ప్రభావంతో గడచిన వర్షాకాలంలో లోటు వర్షపాతం నమోదైంది. దీంతో చెరువులు ఎండిపోయాయి. వాటిలోకి చుక్కనీరు చేరలేదు. చివరికి జలవనరుల శాఖ అధికారులు పులిచింతల నుంచి నీటిని ప్రకాశం బ్యారేజీకి విడుదల చేశారు. ఇక్కడి నుంచి రెండు దఫాలుగా తాగునీటికి నీటిని విడుదల చేశారు. గడచిన ఏడాది జూన్‌లో ఒకసారి తాగునీటిని విడుదల చేసిన అధికారులు, ఈ ఏడాది ఏప్రిల్‌లో రెండోసారి తాగునీటిని విడుదల చేశారు. అటు పశ్చిమ, ఇటు తూర్పు డెల్టా పరిధిలో ఉన్న చెరువులను నింపడానికి సుమారుగా పది టీఎంసీల నీరు అవసరమవుతుందని అధికారులు ఒక నిర్ధారణకు వచ్చారు. ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో చెరువులు పూర్తిగా నిండుతాయని అధికారులు భావించారు. ప్రస్తుతం ల్యానినో ప్రభావం నడుస్తున్నా, రుతుపవనాలు తాకినా వర్షాలు పూర్తిస్థాయిలో కురవడం లేదు. దీంతో నదుల పరిస్థితి దారుణంగా ఉంది. చెరువులు చుక్కనీరు లేని దుస్థితికి చేరుకున్నాయి.

• పదిరోజుల పాటు...

సాగునీటి అవసరాల కంటే ముందుగా తాగునీటి అవసరాలు తీర్చాలని అధికారులు యోచిస్తున్నారు. ప్రకాశం బ్యారేజీకి పట్టిసీమ ద్వారా రోజుకు 6వేల క్యూసెక్కుల నీరు వస్తోంది. ఈ నీటిని ముందుగా చెరువులు నింపడానికి ఇవ్వాలని నిర్ణయించారు. ప్రకాశం బ్యారేజీ వద్ద తూర్పు, పశ్చిమ ప్రధాన కాలువల ద్వారా బుధవారం నీటిని విడుదల చేస్తామని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. కాలువల ద్వారా పది రోజులపాటు తాగునీటి అవసరాలు తీర్చడానికి ఈ నీటిని విడుదల చేస్తారు. సాగునీటి అవసరాలకు ఎప్పుడు నీటిని విడుదల చేయాలన్న అంశంపై జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో సమావేశమై నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి. జలవనరుల శాఖ అధికారులతో మంత్రి విజయవాడలో మంగళవారం సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు సమాచారం. చెరువులన్నీ పూర్తిగా నిండిన తర్వాత సాగునీటిని ఇవ్వడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

కన్నీటి వీడ్కోలు!

అల్ట్రాటెక్ కర్మాగారం ప్రమాదంలో మృతిచెందిన వెంకటేశ్ అంతిమ యాత్ర

- కొడుక్కి తండ్రి దహన సంస్కారాలు
- బాధిత కుటుంబ సభ్యులకు కలెక్టర్, ఎమ్మెల్యే ఓదార్పు



అంతిమయాత్రలో పాల్గొన్న గ్రామస్తులు



వెంకటేశ్ కుమార్తెలు వర్షిణీ, తేజస్వీ

జగ్గయ్యపేట రూరల్, జూలై 8 : కుటుంబానికి జీవనాధారంగా ఉంటాడనుకున్న కొడుకు అర్ధంతరంగా ప్రమాదంలో ప్రాణాలు పోగొట్టుకోవడంతో ఆ కుటుంబం దిక్కులేనిదైంది. పక్షవాతంతో బాధపడుతున్న తండ్రి కొడుకు దహన సంస్కారాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. అల్ట్రాటెక్ సిమెంటు కర్మాగారం ప్రమాద ఘటనలో మృతి చెందిన వెంకటేశ్ కుటుంబం ఒంటరిదైంది. ఆకుల వెంకటేశ్ మృతదేహాన్ని - మిగతా 6లో

గ్రామస్తులపై లాఠీచార్జి

అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో గాయపడిన కుటుంబ సభ్యులతో కలెక్టర్ సృజన, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, డీసీపీ శ్రీనివాసరావు సోమవారం కర్మాగారంలో ముఖాముఖి మాట్లాడారు. కుటుంబాల నేపథ్యం వారి పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సమావేశానికి ముందు కర్మాగారం ప్రమాదంలో క్షతగాత్రులు, మృతుని కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం గ్రామస్తులు పెద్దఎత్తున బైకులు, ట్రాక్టర్‌లతో కంపెనీ వద్దకు వెళ్లారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రధాన గేట్లను మూసేయటంతో ఆగ్రహించిన వారు ట్రాక్టర్‌లతో ఢీకొట్టి ప్రాంగణంలోకి పరుగులు పెట్టారు. కర్మాగార రక్షణకు మోహరించిన పోలీసులపై ఆగ్రహించిన గ్రామస్తులు పోలీసులపై రాళ్ల దాడి చేశారు. పోలీసులు లాఠీలకు పనిచెప్పడంతో పలువురు గాయపడ్డారు. కర్మాగార ప్రమాదంలో బాధితుల పక్షాన సమస్య పరిష్కారానికి వచ్చిన తమను పోలీసులు ఇష్టారాజ్యంగా దాడి చేసి చితకొట్టారని గ్రామస్థులు గోపి, మోహన్, ఆంజనేయులు ఆరోపించారు. గ్రామస్థుల దాడిలో నందిగామకు చెందిన ఇద్దరు సీఐలు, విజయవాడకు చెందిన మరో ఇద్దరు సీఐలకు గాయాలయ్యాయని సీఐ జానకిరామ్ తెలిపారు. పరిస్థితి గమనించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ వారికి సర్దిచెప్పి అక్కడి నుంచి పంపారు.



దుర్గమ్మకు సారె సమర్పించిన భక్త బృందాలు

దుర్గమ్మకు ఆషాఢం సారె సమర్పణ

వన్‌టౌన్, జూలై 8 : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు జరుగుతున్న ఆషాఢమాస ఉత్సవాల క్రమంలో సోమవారం 723 మంది భక్తులు సారె సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. కనకదుర్గ లలితా పారాయణ బృందానికి చెందిన 400 మంది, వివిధ ప్రాంతాలకు చెందిన పలు భక్త బృందాలకు చెందిన మరో 323 మంది సారె సమర్పించారు. పట్టుచీరలు, సుగంధ పరిమళ ద్రవ్యాలు, పసుపు, కుంకుమ, గాజులు, తీపి పదార్థాలను అమ్మవారికి సమర్పించారు, మహామండపంలోని 6వ అంతస్తులో ప్రత్యేక అర్చనల అనంతరం ఆశీస్సులు అందుకున్నారు.

విమానాశ్రయానికి ప్రముఖుల తాకిడి



కేంద్రమంత్రి మురుగన్‌కు స్వాగతం పలుకుతున్న బీజేపీ నేతలు

గన్నవరం(ఉంగుటూరు) జూలై 8 : పలువురు రాజకీయ ప్రముఖుల రాకపోకలతో సోమవారం గన్నవరం విమానాశ్రయంలో సందడి వాతావరణం నెలకొంది. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, ఎంపీ కేశినేని చిన్ని హైదరాబాద్ నుంచి ఇండిగో విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. అనంతరం అక్కడ్నుంచి రోడ్డు మార్గాన విజయవాడ బయలుదేరి వెళ్లారు. కాగా కేంద్ర బ్రాడ్‌కాస్టింగ్ అండ్ ఇన్‌ఫర్మేషన్ శాఖామంత్రి ఎల్.మురుగన్ చెన్నై నుంచి ఇండిగో విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. పలువురు బీజేపీ నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో రాజమండ్రిలో జరిగే బీజేపీ కార్యవర్గ సమావేశంలో పాల్గొనేందుకు బయలుదేరి వెళ్లారు. మంగళగిరి సీకే కన్వెన్షన్ హాలులో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశంలోని వివిధ రాష్ట్రాలనుంచి కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు ప్రత్యేక విమానాల్లో గన్నవరం చేరుకున్నారు. వారికి స్వాగతం పలికేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన పార్టీశ్రేణులతో విమానాశ్రయం కోలాహలంగా మారింది. మాజీ సీఎం వైఎస్ జగన్, భారతి దంపతులు ఇడుపులపాయనుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకోగా వారికి వైసీపీ శ్రేణులు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో తాడేపల్లి నివాసానికి బయలుదేరి వెళ్లారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కుటుంబసమేతంగా కడపనుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకోగా వారికి నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. రోడ్డు మార్గంలో ఆమె మంగళగిరికి బయలుదేరి వెళ్లారు. తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయన వెంట ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, దానం నాగేంద్ర, జైపాల్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్, ఫ్రాంక్లిన్ కె.సునీల్ తదితరులు వున్నారు. వీరంతా మంగళగిరికి రోడ్డుమార్గంలో బయలుదేరి వెళ్లారు.

కాంగ్రెస్‌కు పూర్వవైభవం తెస్తాం : రఘువీరా



గన్నవరం(ఉంగుటూరు), జూలై 8 : రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీకి పూర్వవైభవం తీసుకొస్తామని కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి రఘువీరారెడ్డి అన్నారు. దివంగత మాజీముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి కార్యక్రమానికి హాజరయ్యేందుకు హైదరాబాద్‌నుంచి గన్నవరం చేరుకున్న ఆయన విమానాశ్రయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయాలన్నదే వైఎస్ చివరి కోరిక అని, దాన్ని నెరవేర్చేందుకు కాంగ్రెస్‌పార్టీలో వున్న నాయకులందరూ సమష్టిగా కృషిచేస్తున్నామన్నారు. మరో ఐదేళ్లలో వైఎస్సార్ ఆశయం నెరవేరుతుందన్న ఆయన రాష్ట్రానికి ప్రత్యేకహోదా రాహుల్‌తోనే సాధ్యమని స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో కాంగ్రెస్ ఓటు బ్యాంకు గతం కంటే పెరిగిందన్నారు. అనంతరం రోడ్డు మార్గంలో మంగళగిరికి బయలుదేరి వెళ్లారు.

ఉచిత ఇసుక విధానం అభినందనీయం

- వైసీపీ ఇసుక అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలి
- విభజన పంపకాల్లో రాష్ట్రానికి న్యాయం జరగాలి
- ప్రత్యేక హోదా తెచ్చే పార్టీతో కలిసి పనిచేస్తాం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కె.రామకృష్ణ



మచిలీపట్నం టౌన్, జూలై 8 : రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన ఇసుక పాలసీ వల్ల భవన కార్మికులకు పని దొరుకుతుందని, ఇది శుభ పరిణామమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కె.రామకృష్ణ అన్నారు. ఆదివారం మచిలీపట్నంలో మోదుమూడి శ్రీహరిరావు సంస్మరణ సభకు హాజరైన ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. వైసీపీ పాలనలో అక్రమ మైనింగ్‌లో వేలకోట్లు దోచుకున్న నేతలపై చర్యలు తీసుకోవాలన్నారు. అమరావతితో పాటు వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి కేంద్ర నిధులు తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఏపీలోపి ఐదు గ్రామాల విలీనంపై తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మంచి నిర్ణయం తీసుకునేందుకు ముందుకురావడం అభినందనీయమన్నారు. విభజన ఆస్తుల పంపకంలో వేలకోట్ల ఆస్తులు ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సి ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రత్యేక హోదా లక్ష్యంగా ఉన్న ఏ పార్టీతోనైనా కలిసి పనిచేస్తామన్నారు. ఖరీఫ్ ప్రారంభమైన దృష్ట్యా సీఎం చంద్రబాబు ప్రకటించిన వాగ్దానం మేరకు రైతులకు సాయం అందించాలన్నారు.

తెలంగాణా ముఖ్యమంత్రికి స్వాగతం



కృష్ణలంక : దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలలో పాల్గొనేందుకు సోమవారం నగరానికి వచ్చిన తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ జి.సృజన మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

కొండపల్లి బొమ్మల కళాకారులకు చేయూత..

- మంత్రి సవిత



కొండపల్లి బొమ్మల కళాకారులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

ఇబ్రహీంపట్నం, జూలై 8 : కొండపల్లి బొమ్మల కళాకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సంజీవ రెడ్డి సవిత అన్నారు. కొండపల్లి బొమ్మల కాలనీలో సోమవారం ఆమె పర్యటించారు. మహాత్మా జ్యోతిబాఫూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ హాస్టల్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కొండపల్లి కళాకారుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కొండపల్లి బొమ్మలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళతారన్నారు. కొండపల్లి కోట వద్ద బొమ్మల విక్రయానికి చర్యలు తీసుకుంటామన్నారు. వసతిగృహంలో 8, 9 తరగతులలో 40 సీట్ల చొప్పున పెంపునకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు చెన్నుబోయిన చిట్టిబాబు, చుట్టకుదురు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన వెనిగండ్ల



గుడివాడ : రాష్ట్ర రాజధాని అమరావతితో పాటు గుడివాడ అభివృద్ధికి ప్రాధాన్యత కల్పిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో చంద్రబాబును కలిసి సమస్యలను విన్నవించారు. జాతీయ రహదారుల పరిధిలో ఉన్న గుడివాడలోని బైపాస్‌రోడ్ల అభివృద్ధికి, ఆర్ అండ్ బీ శాఖ పరిధిలోని అన్ని ప్రధాన రహదారులు, గుడివాడలో ఐటీ సెజ్ ఏర్పాటు తదితర వినతులను చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లగా సానుకూలంగా స్పందించినట్టు వెనిగండ్ల తెలిపారు.

ప్రాణం కంటే.. ఇసుక ముఖ్యమా!

- అల్ట్రాటెక్ పేలుడు ఘటనలో రెవెన్యూ అధికారుల తీరుపై కలెక్టర్ ఫైర్
- తహసీల్దార్, నందిగామ ఆర్డీవోలపై తీవ్ర ఆగ్రహం



రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్

ఆంధ్రజ్యోతి, విజయవాడ : అంత పెద్ద సంఘటన జరిగితే కనీసం బాధ్యత లేదా.. ప్రజల ప్రాణాలను కాపాడటానికి రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి.. అధికారులు త్వరగా స్పందించి ఉంటే ప్రాణనష్టం లేకుండా చూడవచ్చు.. రెవెన్యూ అధికారులు తగిన విధంగా స్పందించలేదు.. ఘటన సమయంలో ఉచిత ఇసుక పంపిణీకి సంబంధించి అధికారులతో సమావేశమైనట్టు తహసీల్దార్ చెప్పే ప్రయత్నం చేయగా.. మీకు ఇసుక ముఖ్యమా? ప్రజల ప్రాణాలు ముఖ్యమా.. అంటూ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ నిప్పులు చెరిగారు.

అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో బాయిలర్ పేలుడు ఘటనలో అలసత్వం వహించిన రెవెన్యూ అధికారులపై కలెక్టర్ సృజన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బూదవాడలోని ఫ్యాక్టరీ ప్రమాదం పట్ల రెవెన్యూ యంత్రాంగం తగిన విధంగా స్పందించకపోవటం పట్ల ఆమె సీరియస్ అయ్యారు. కంపెనీ యాజమాన్యంతో మాట్లాడటానికి, బాధితుల కుటుంబసభ్యులను పరామర్శించి వారి సమస్యలను తెలుసుకోవటంతో పాటు, యాజమాన్యం నుంచి తగిన సహాయ, సహకారాలను అందించేందుకు సోమవారం కలెక్టర్ సృజన జగ్గయ్యపేట వచ్చారు. ఈ క్రమంలో స్థానిక తహసీల్దార్ సరిగా స్పందించకపోవటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సమాచారం తెలపకపోవటం పట్ల కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఇంత పెద్ద ప్రమాదం జరిగినపుడు కనీసం అప్రమత్తంగా కూడా లేకపోవటంపై కలెక్టర్ మండిపడ్డారు. నందిగామ ఆర్డీవో తీరుపైనా కలెక్టర్ సీరియస్ అయ్యారు. అంత పెద్ద సంఘటన జరిగితే కనీసం బాధ్యత లేదా.. అని జేసీ సంపత్ కుమార్ ఎదుట కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ఒకనాక దశలో ఇక్కడ ఎవరైనా ఉన్నారా.. చచ్చిపోయారా.. అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అనంతరం బాధితులతో, కంపెనీ యాజమాన్యంతో, స్థానిక ఎమ్మెల్యేతో చర్చించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు నిర్దేశించి విజయవాడ బయలుదేరారు.

పోలీసుల తీరుపైనా ఆగ్రహం..

నందిగామ : బూదవాడ సిమెంటు పరిశ్రమలో పేలుడు ఘటనలో ఆందోళన చేస్తున్న బాధితులపై పోలీసులు లాఠీచార్జి చేయడంపై కలెక్టర్ సృజన ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో ఆమె అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్డీవో ఉండి కూడా లాఠీ చార్జి వరకూ పరిస్థితిని ఎందుకు తెచ్చారని ప్రశ్నించారు. బాధితులపై దాడి చేయడం దారుణమన్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకూ అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు.

కన్నీటి వీడ్కోలు!

(5వ పేజీ తరువాయి)



మృతుడి భార్య కన్నీటి పర్యంతం

సోమవారం విజయవాడలో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందించారు. మధ్యాహ్న సమయంలో బూదవాడకు చేరుకున్న మృతదేహాన్ని కడసారి చూపునకు ఇంటికి చేర్చారు. అంతిమయాత్రలో బంధువులు, గ్రామస్తులు పాల్గొని కన్నీటి పర్యంతమయ్యారు. పక్షవాతంతో బాధపడుతున్న తండ్రి వీరయ్య కుమారుడి మృతదేహానికి నిప్పంటిస్తూ విలపించారు.

వెంకటేశ్ కుటుంబ పరిస్థితి ఇదీ..

వెంకటేశ్ తండ్రి వీరయ్య పక్షవాతంతో బాధపడుతున్నాడు. తల్లి రమాదేవి వృద్ధురాలు. భార్య త్రివేణి, పిల్లలు వర్షిణి, తేజస్వీ. వీరందరికీ వెంకటేశ్ ఒక్కడే ఆధారం. చిన్నపాటి రేకుల షెడ్డులో ఈ కుటుంబం జీవనం సాగిస్తోంది. వెంకటేశ్ తండ్రి వీరయ్య మాట్లాడుతూ ముదిమి వయసులో అండగా ఉంటాడనుకున్న కుమారుడు మృత్యువాత పడటంతో తమకు దిక్కుతోచడం లేదన్నారు. చిన్నారులు, కోడలను ఎలా ఓదార్చాలో.. వారిని ఎలా పోషించాలో అర్థం కావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటేశ్ భార్య త్రివేణి ఏకధాటిగా రోదిస్తూనే ఉంది.

కంటిచూపు కోల్పోయిన కొడుకును ఎలా పోషించాలి

సిమెంట్ కర్మాగారం ప్రమాదంలో చూపు కోల్పోయిన దారావత్ వెంకటేశ్వర్లుది మరో విషాదం. ఈయనకు వృద్ధురాలైన తల్లి, భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరందరికీ వెంకటేశ్వర్లే ఆధారం. కంటిచూపు కోల్పోవడంతో ఇకపై కుటుంబ పోషణ ఎలా అని తల్లి, భార్య వాపోతున్నారు. కంటిచూపు కోల్పోయిన కుమారునితో తమ జీవనం ఎలా సాగుతుంది అంటూ వృద్ధురాలైన తల్లి చిలకమ్మ విలపించారు.

ఉదయభానును అడ్డుకున్న పోలీసులు

బూదవాడ అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగార ప్రమాదంలో గాయపడిన కుటుంబ సభ్యులను ఓదార్చేందుకు గ్రామానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభానును రెవెన్యూ, పోలీసులు సోమవారం గ్రామంలోకి రాకుండా అడ్డగించారు. నియోజకవర్గంలో నాకు 90 వేల ఓట్లు వచ్చాయని, ప్రమాదంలో గాయపడిన వారి కుటుంబాలను పరామర్శించకుంటే తనపై మరోలా ప్రచారం జరుగుతుందని, బాధితులను పరామర్శించాలని పట్టుబట్టినా ప్రస్తుతం కలెక్టర్, ఎమ్మెల్యేలు, బాధిత కుటుంబాలు, యాజమాన్యంతో సంప్రదింపులు జరుగుతున్నాయని జేసీ సంపత్‌కుమార్ తెలిపారు. వారు వెళ్లిన తరువాత రావాలని అధికారులు సూచించటంతో ఉదయభాను వారిపై ఆగ్రహం వ్యక్తం చేసి వెనుదిరిగారు.

ప్రమాణాలు పాటించాల్సిందే

- ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు
- ప్రత్యేక కమిటీతో పరిశ్రమల్లో తనిఖీలు : కలెక్టర్ సృజన

విజయవాడ లీగల్, జూలై 8 : పరిశ్రమల్లో కార్మికుల భద్రత, కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ తదితరాలకు సంబంధించి నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన స్పష్టం చేశారు. అల్ట్రాటెక్ కర్మాగారంలో ప్రమాదం నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో జేసీ పి.సంపత్‌కుమార్‌తో కలిసి పరిశ్రమలు, కర్మాగారాలు, కాలుష్య నియంత్రణ, విపత్తుల నిర్వహణ, కార్మిక



అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పరిశ్రమల్లో అత్యున్నత భద్రతా ప్రమాణాలు పాటిస్తూ పని ప్రదేశాలను అత్యంత సురక్షితంగా వుండేలా చూడాలని, చిన్నపాటి నిర్లక్ష్యం పెను విపత్తుకు దారితీయొచ్చనే విషయాన్ని గుర్తించి పరిశ్రమలు మార్గదర్శకాలను పాటించేలా పర్యవేక్షణ వుండాలన్నారు. హానికర రసాయనాల నిల్వ, వినియోగం తదితర కార్యకలాపాలు నిర్వహించే పరిశ్రమలతో పాటు ప్రమాదాలకు ఆస్కారమున్న పరిశ్రమలకు తక్షణం నోటీసులు జారీచేయాలని, నాలుగు రోజుల్లో నిర్వహణ పరంగా నిపుణులతో అంతర్గత తనిఖీలు చేయించుకొని, నిర్వహణ, భద్రతపరంగా ధ్రువీకరణ పత్రాలు అందించేలా ఆదేశాలివ్వాలన్నారు. అనంతరం జిల్లాస్థాయి ప్రత్యేక కమిటీ దశల వారీగా అన్ని పరిశ్రమల్లోను తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. కార్మికుల భద్రతతో పాటు సంక్షేమానికి సంబంధించి నిబంధనలను తూ.చ తప్పకుండా పాటించాల్సిందేనని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జీఎం డీఐసీ ఎ.సుధాకర్ పీసీబీ ఈఈ పి.శ్రీనివాసరావు, ఫ్యాక్టరీల డిప్యూటీ చీఫ్ ఇనస్పెక్టర్ ఎం.శివకుమార్‌రెడ్డి, ఉప కార్మిక కమిషనర్ సీహెచ్ ఆశారాణి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

- కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ

మచిలీపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కారం చూపాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జేసీ గీతాంజలి శర్మతో కలిసి ప్రజలనుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సుదూర ప్రాంతాలనుంచి తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో ప్రజలు వస్తున్నారని, వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా అధికారులు సానుకూలంగా వ్యవహరించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 152అర్జీలను వచ్చాయి. బాపులపాడు మండలం మడిచర్ల గ్రామానికి చెందిన దివ్యాంగురాలు తనకు నూరుశాతం వైకల్యం ఉందని, నెలకు రూ.15వేల పింఛను ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అర్జీ అందజేశారు. బంటుమిల్లి మండలం ముదాలపల్లెకు చెందిన జన్ను వీరఅర్జున అనే రైతు రామవరపుమోడిగ్రామంలో తనకు సాగు భూమి ఉందని, అక్కడ ఓఎన్‌జీసీ రిగ్ ద్వారా విడుదల చేసే రసాయనాల కారణంగా తన పంట దెబ్బ తిందని, తనకు పంటనష్టపరిహారం ఇప్పించాలని అర్జీ అందజేశారు. ఎన్నికల సమయంలో తీసిన ఫోటోగ్రఫీ, వీడియో గ్రఫీ బిల్లులు చెల్లించాలని కలెక్టర్ బాలాజీకి సోమవారం వీడియోగ్రాఫర్లు వినతి పత్రం సమర్పించారు. తమ సమస్యను ఉన్నతాధికారులకు తెలిపామని, బడ్జెట్ రాగానే బిల్లులు సమర్పిస్తామన్నారు. తన స్థలంలో కొంత భాగం బలవంతంగా ఆక్రమించేందుకు స్థానికులు బెదిరిస్తున్నారని గూడూరు మండలం రామరాజుపాలెం గ్రామానికి చెందిన వృద్ధురాలు దేసు మల్లమ్మ మొరపెట్టుకుంది. సోమవారం జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర నాయక్, డీఎల్పీవో జ్యోతిర్మయిని వృద్ధురాలు కలిసి తన గోడు వెళ్లబోసుకుంది. దౌర్జన్యంగా తన స్థలంలో కొంత భాగం ఇచ్చేయమంటున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖర్, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో ఆనందకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పటిష్టంగా స్టాప్ డయేరియా ..

1వతేదీనుంచి ఆగస్టు 31వతేదీవరకు జిల్లాలో చేపట్టిన స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం మునిసిపల్ కమిషనర్లు, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్ పంచాయతీరాజ్ విభాగాల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకులను క్లీన్ చేయడంతో పాటు, తాగునీటి పైప్‌లైన్‌ల లీకేజీలు వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. వార్డు, గ్రామ సచివాలయాల పరిధిలో ఎమినిటీస్ సెక్రటరీలు, ఇంజనీర్లు ఈ పనిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి, డీపీవో నాగేశ్వరనాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శివప్రసాద్, ఐసీడీఎస్ పీడీ సువర్ణ, మచిలీపట్నం, గుడివాడ, తాడిగడప మునిసిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

15 నుంచి స్వర్ణభారత్ ట్రస్ట్‌లో వృత్తినైపుణ్య కోర్సులకు ఉచిత శిక్షణ

ఉంగుటూరు, జూలై 8 : కృష్ణాజిల్లా స్వర్ణభారత్‌ట్రస్ట్ ప్రాంగణంలోని యూనియన్‌బ్యాంక్ గ్రామీణ స్వయంఉపాధి ఉచితశిక్షణాసంస్థ(యూబీఆర్‌ఎస్‌ఈటీఐ)లో ఈనెల 15నుంచి ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ(30రోజులు), మహిళా టైలరింగ్(30రోజులు), సెల్‌ఫోన్ రిపేర్ అండ్ సర్వీసెస్(30రోజులు)పై ఉమ్మడి కృష్ణాజిల్లాల్లోని నిరుద్యోగయువతకు ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్టు సంస్థ డైరెక్టర్ పి.మల్లికార్జునరెడ్డి తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, తెల్లరేషన్ కార్డు కలిగి, 18నుంచి 45సం.ల మధ్య వయసు, తెలుగులో చదవటం, రాయటం వచ్చిన కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతీ, యువకులు పైన తెలిపిన కోర్సుల్లో ఉచిత శిక్షణ పొందేందుకు అర్హులని చెప్పారు. శిక్షణా కాలంలో అభ్యర్థులకు భోజన, వసతి సదుపాయాలు కల్పించబడతాయన్నారు. అభ్యర్థులకు సర్టిఫికెట్లు, కోర్సులకు సంబంధించిన మెటీరియల్ ఉచితంగా అందించడంతోపాటు, వారి ఉపాధికి అవసరమైన సహాయసహకారాలు పూర్తిస్థాయిలో అందించడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు నాలుగు పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటోలు, రేషన్, ఆధార్ కార్డు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాల నకళ్లతో ఈనెల 15వతేదీలోగా నేరుగా శిక్షణాకేంద్రానికి విచ్చేసి పేర్లను నమోదుచేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 6304254730, 9951920120, 9962512337, 9440772382 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఉచిత ఇసుక అమలుకు చర్యలు తీసుకోండి

- జేసీ గీతాంజలి శర్మ



అధికారులతో మాట్లాడుతున్న కృష్ణా జేసీ

మచిలీపట్నం,జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుకవిధానాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జేసీ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు. జేసీ ఛాంబరులో సోమవారం వివిధశాఖల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఉచిత ఇసుకవిధానం అమలులో భాగంగా ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలను అధికారులు తూచా తప్పకుండా పాటించాలన్నారు. కృష్ణానదిలో అనధికార ఇసుక తవ్వకాలను అరికట్టాలన్నారు. ఇందుకోసం కీలకమైన ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలన్నారు. ఇసుకరీచ్‌ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటుతోపాటు, రెవెన్యూడివిజన్ స్థాయిలో కమాండింగ్ కంట్రోల్ రూమ్‌లను, డివిజన్, మండలస్థాయిలో విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ జి వెంకటేశ్వరరావు, మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవోలు ఎం వాణి, పి పద్మావతి, డి రాజు, గనులశాఖ ఏడీ ప్రతాపరెడ్డి, డీపీవో నాగేశ్వరనాయక్, ఎస్‌ఈబీ సూపరింటెండెంట్ జి గంగాధరరావు, భూగర్భజలాలు, రవాణా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

మచిలీపట్నం టౌన్ : జిల్లాలోని వివిధ పాఠశాలల్లో 6 నుంచి 10 తరగతుల విద్యార్థులు ఇన్‌స్పైర్ అవార్డులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పంపాలని డీఈవో తాహెరా సుల్తానా తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు పాఠశాలల్లోని విద్యార్థుల చేపట్టబోయే ప్రాజెక్టుల వివరాలను తెలియ చేయాలన్నారు. వివరాలకు జిల్లా సైన్స్ ఆఫీసర్ జాకీర్ అహమ్మద్ 7386311633కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.



బాధితుల కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్, ఎంపీ కేశినేని చిన్ని

పేలుడు ఘటన దురదృష్టకరం

- మృతుడి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం
- ఎంత ఖర్చయినా బాధితులకు మెరుగైన వైద్యం
- మంత్రి సుభాష్, ఎంపీ కేశినేని చిన్ని వెల్లడి

గొల్లపూడి, జూలై 8 : జగ్గయ్యపేట బోదవాడలో అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో పేలుడు ఘటన దురదృష్టకరమని, మృతుడి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం అందించేందుకు ఫ్యాక్టరీ యాజమాన్యం అంగీకరించినట్టు రాష్ట్ర కార్మిక, కర్మాగార, బ్రాయిలర్స్, వైద్య బీమా సేవలశాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్ తెలిపారు. ఆయన విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్‌తో కలిసి సోమవారం మణిపాల్, గొల్లపూడి ఆంధ్రా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి, వారి కుటుంబసభ్యులతో మాట్లాడారు. ఈసందర్భంగా మంత్రి సుభాశ్, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ, బాధితులకు మెరుగైన వైద్యం కోసం ఎంత ఖర్చుకైనా వెనకాడవద్దని వైద్యాధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎం.ఎస్ బేగ్, జంపాల సీతారామయ్య, శావల దేవదత్, కొట్టారు సత్యనారాయణ, కార్మికశాఖ కమిషనర్ ఎం.శేషగిరిబాబు, ఆర్డీవో బి.హెచ్ భవానీశంకర్, డీఎంఅండ్‌హెచ్‌వో ఎం.సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రూ. కోటి ఇవ్వాలి

- సీపీఐ నేత దోనేపూడి శంకర్ డిమాండ్

గొల్లపూడి : అల్ట్రాటెక్ ప్రమాద ఘటనలో మృతి చెందిన ఆవుల వెంకటేశ్ కుటుంబానికి ప్రభుత్వం, కంపెనీ యాజమాన్యం కలిపి రూ.కోటి పరిహారం ఇవ్వాలని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ డిమాండ్ చేశారు. ఆంధ్రా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆయన సోమవారం పరామర్శించారు. 80 శాతం గాయాలతో మృత్యువుతో పోరాడుతున్న శివన్నారాయణ పరిస్థితి చూసి చలించిపోయారు. 60 శాతం గాయపడిన వారికి రూ.50 లక్షలు అందించాలన్నారు. ఆయన వెంట ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, అంబోజీ శివాజీ, లంకా గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.



గంజాయి నిందితులతో పోలీసు అధికారులు

కిలోన్నర గంజాయి స్వాధీనం

- ఏడుగురి అరెస్టు

పమిడిముక్కల, జూలై 8 : లంకపల్లి శివారు అప్పారావుపేట కరకట్టపై గంజాయి కలిగి ఉన్న ఏడుగురిని సోమవారం అరెస్టుచేసి వారివద్ద నుంచి కిలోన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు పమిడిముక్కల సీఐ ఎం.కిశోర్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. లంకపల్లి కరకట్టపై గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్సై కె.శ్రీనివాస్, సిబ్బందితో దాడిచేసి నాగాయలంకకు చెందిన కొక్కిలిగడ్డ కృష్ణవంశీ, వణుకూరుకు చెందిన షేక్ అలీబాబ, ఈడ్పుగల్లుకు చెందిన షేక్ సైదా(పండు), పమిడిముక్కలకు చెందిన బండ్రపల్లి అవినాశ్, అప్పారావుపేటకు చెందిన చీకుర్తినాని, రాగాల మధుకిషోర్, ముళ్లపూడి వెంకటేశ్వరరావులను అరెస్టుచేసి గంజాయి స్వాధీనం చేసుకునట్టు తెలిపారు. ద్విచక్రవాహనం, రూ. 500 నగదు స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరుపరుస్తున్నట్టు తెలిపారు. మద్దూరుకు చెందిన తలారి వివేక్ పరారిలో ఉన్నట్టు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గురజాడ డొంకరోడ్డులో పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్టుచేసి వారి నుంచి రూ. 60,320 నగదు పది సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్టు పమిడిముక్కల ఎస్సై కె.శ్రీనివాస్ తెలిపారు. మండల పరిధిలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్టు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తిచేశారు.

జోగి అనుచరులపై చర్యలు తీసుకోవాలి

- కృష్ణా జిల్లా వాసి ఫిర్యాదు

అమరావతి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ మంత్రి జోగి రమేశ్ అనుచరుడి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కృష్ణాజిల్లా చినగొల్లపాలేనికి చెందిన ఏలూరి రంగబాబు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం అమరావతి సచివాలయంలో రెవెన్యూ మంత్రి, ఉన్నతాధికారులను కలిసేందుకు వచ్చిన రంగబాబు మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రి జోగి రమేష్ అనుచరుడు శ్రీనివాసరెడ్డి తమ పూర్వార్జిత భూమిని అధికారులతో మేనేజ్ చేసి, వివాదాస్పద భూమి కింద పెట్టించారని ఆరోపించారు. ఈ సమస్య పరిష్కరించడానికి రూ.15లక్షలు డిమాండ్ చేశారని, ఇవ్వకపోవడంతో ఇప్పుడు ఫేక్ డాక్యుమెంట్లు తయారు చేయాలని చూస్తున్నాడని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు తమకు న్యాయం చేయాలని కోరుతూ ఫిర్యాదిస్తున్నట్టు తెలిపారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

వత్సవాయి : లింగాలలో అక్రమంగా డంప్ చేసిన 700 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సోమవారం పోలీసులు పట్టుకొని సివిల్ సప్లై అధికారులకు అప్పగించారు. నల్లగొండ జిల్లా కోదాడ డీఎస్పీ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రం నుంచి అక్రమంగా ఆంధ్రాకు పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా అన్నవరం గ్రామానికి చెందిన సాంబశివరావును, జగ్గయ్యపేటకు చెందిన కోటేశ్వరరావును పోలీసులు కోదాడలో పట్టుకున్నారు. సమాచారం మేరకు బోర్డర్‌లోని లింగాల సమీపంలో గోదాంలో అక్రమంగా నిల్వ ఉంచిన 1,400 (50 కిలోల బస్తాలు) పీడీఎస్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఏపీ అధికారులు తెలంగాణ పోలీసులకు బియ్యాన్ని స్వాధీనం చేశారు. పట్టుబడిన బియ్యాన్ని సివిల్ సప్లయి అధికారులకు అప్పగించనున్నట్టు తెలిపారు. లింగాలకు చెందిన నరసింహారావుపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.55

క్రికెటర్‌కు బోడె ఆర్థిక సాయం

కంకిపాడు, జూలై 8 : అండర్ - 19 ఢిల్లీ జట్టుకు ఎంపికైన క్రికెటర్ వల్లూరి పవన్‌కుమార్‌కు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తనయుడు బోడె వెంకట్రామ్ సోమవారం ఆర్థిక సాయం చేశారు. కోలవెన్నుకు చెందిన పవన్‌కుమార్ ఢిల్లీ క్రికెట్ అండర్ - 19 జట్టుకు ఎంపికయ్యాడు. ఢిల్లీ వెళ్లేందుకు ఖర్చులు లేక ఇబ్బందులు పడుతున్నాడు. కోలవెన్ను గ్రామ టీడీపీ నాయకులు క్రికెటర్ ఆర్థికపరిస్థితిని వెంకట్రామ్‌కు వివరించారు. స్పందించిన ఆయన పవన్‌ను తక్షణమే పోరంకి పార్టీ కార్యాలయానికి పిలిపించి రూ. 10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.



పవన్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న బోడె వెంకట్రామ్

గండిగుంటలో అగ్నిప్రమాదం



కాలిపోయిన ఇల్లు

గండిగుంట(ఉయ్యూరు), జూలై 8 : గండిగుంటలో సోమవారం అగ్నిప్రమాదం సంభవించి రమాదేవికి చెందిన రాతిగోడల ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఇంటిలో ఎవరూ లేని సమయంలో మంటలు లేచి ఇల్లంతా కాలిపోయి కట్టుబట్టలతో మిగిలారు. ఉయ్యూరు అగ్నిమాపక శాఖ ప్రమాదస్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేసింది. విద్యుత్‌షార్టు సర్క్యూట్‌తో ప్రమాదం సంభవించి ఉంటుందని స్థానికులు తెలిపారు. ప్రమాదంలో రెండు లక్షల రూపాయల మేర ఆస్తినష్టం వాటిల్లి ఉంటుందని అంచనాగా ఫైర్ సిబ్బంది తెలిపారు.

● అగ్నిప్రమాదంలో ఇల్లు కాలిపోయి కట్టుబట్టలతో మిగిలిన రమాదేవి కుటుంబానికి తెలుగు యువత అధ్యక్షుడు దండమూడి చౌదరి రూ. 5వేలు డీజేఆర్ మెమోరియల్ ట్రస్టు ద్వారా అందజేశారు.

మాజీ మంత్రి జోగి రమేశ్‌ను అరెస్టు చేయాలి: టీడీపీ

కంకిపాడు, జూలై 8 : భూ ఆక్రమణలకు పాల్పడిన మాజీ మంత్రి జోగి రమేశ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని కంకిపాడు తెలుగుదేశం పార్టీ మండల కార్యదర్శి పులి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడుతూ, అధికారాన్ని అడ్డుపెట్టుకొని పెడన నియోజకవర్గంలో అరాచకాలకు పాల్పడ్డాడని, అక్కడ ప్రజలు తిరస్కరించడంతో పెనమలూరు చేరి అధికారాన్ని అడ్డుపెట్టుకొని వందల కోట్ల రూపాయలు అక్రమంగా దోచేశాడని మండిపడ్డారు. కులాల మధ్య చిచ్చు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా అగ్రిగోల్డ్ భూములు ఆక్రమించినట్లు వస్తున్న ఆరోపణల ఆధారంగా జోగి రమేశ్‌ను, ఆయన కుమారుడు రాజీవ్‌ను తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో స్థానిక టీడీపీ నాయకులు ఏనుగ జయప్రకాష్, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

ఉయ్యూరు, జూలై 8 : ఉయ్యూరు మండల పరిధి గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీలు చేసి రూ.8.19 లక్షల జరిమానా విధించారు. ఆపరేషన్ ఈఈ కృష్ణానాయక్ , విజిలెన్స్ ఈఈ కె.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అధికారులు 36 బృందాలుగా ఏర్పడి 2,385 గృహ సర్వీసులు, 88 వాణిజ్య సర్వీసులు తనిఖీ చేసి వాటిలో 274 సర్వీసులకు అదనపులోడు 385 కిలోవాట్ మొత్తానికి రూ. 7.70 లక్షలు, అనుమతిలేని కేటగిరీలు వాడుతున్న ఏడుగురిని గుర్తించి రూ. 19వేలు జరిమానా విధించినట్లు ఈఈ కృష్ణానాయక్ తెలిపారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, విద్యుత్ చౌర్యంకు పాల్పడేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యుత్ చౌర్యం జరుగుతున్నట్టు తెలిస్తే 9440812362, 9440812363, 8331014951 సెల్ నంబర్లకు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సబ్ డివిజనల్ డీఈఈ రామకృష్ణ, రూరల్ ఏఈ ఎస్‌వీవీ సత్యనారాయణ, ఉయ్యూరు డివిజన్ పరిధి చల్లపల్లి, అవనిగడ్డ సబ్‌డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

పరిష్కార వేదికకు ఐదు అర్జీలు

హనుమాన్‌జంక్షన్, జూలై 8 : బాపులపాడు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు అందినట్లు ఎంపీడీవో కె.రత్నకుమారి తెలిపారు. రెండు అర్జీలు రెవెన్యూ సంబంధిత సమస్యలు, పీఆర్ శాఖ, సామాజిక పింఛన్‌పై అర్జీలు అందినట్లు ఎంపీడీవో తెలిపారు. అర్జీలను పరిష్కారం నిమిత్తం ఆయా శాఖలకు పంపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈవో రాంబాలసింగ్, పంచాయతీ కార్యదర్శులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీసీఆర్సీ కార్డులపై కౌలురైతులకు అవగాహన



సీసీఆర్సీ కార్డులు పొందడంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు

ఉంగుటూరు, జూలై 8 : మండలంలో సార్వా (ఖరీఫ్) ప్రారంభమైన నేపథ్యంలో కౌలుసాగు చేసే కౌలురైతులందరూ పంటసాగు ధ్రువీకరణపత్రాల (సీసీఆర్సీకార్డులు)కు దరఖాస్తు చేసుకోవాలని పెదఅవుటపల్లి వీఆర్వో శ్రీనివాస్ తెలిపారు. పెదఅవుటపల్లి గ్రామ సచివాలయంలో సోమవారం ఈకౌలు గుర్తింపు కార్డులపై కౌలుదారులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీఆర్వో మాట్లాడుతూ, సీసీఆర్సీ కార్డులు కలిగిన కౌలురైతులు ప్రభుత్వ పథకాలకు అర్హులన్నారు. కౌలుసాగుచేసే పొలం వివరాలు, కౌలురైతు ఆధార్‌కార్డు తీసుకుని ఆయా గ్రామాల్లోని వీఆర్వోలను సంప్రదించడంద్వారా కౌలుగుర్తింపు కార్డులు పొందవచ్చునని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ సురేంద్ర పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

పెదఅవుటపల్లి పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీలో కలెక్టర్ డీకే బాలాజీ



పెదఅవుటపల్లి పీహెచ్‌సీలో అందిస్తున్న వైద్యసేవలపై ఫోన్‌లో ఆరా తీస్తున్న కలెక్టర్ బాలాజీ

ఉంగుటూరు, జూలై 8 : వైద్యవృత్తి ఎంతో పవిత్రమైందని, రోగులపట్ల ప్రత్యేకశ్రద్ధ వహించి, మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వైద్యాధికారులకు సూచించారు. మండలంలోని పెదఅవుటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని(పీహెచ్‌సీ) సోమవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పీహెచ్‌సీలోని మందుల విభాగం, ఓపీ రిజిస్టర్, ల్యాబ్‌ను పరిశీలించి ఆసుపత్రిలో చేస్తున్న 63 రకాల పరీక్షల గురించి ఆరా తీశారు. పాముకాటు, కుక్కకాటులకు అవసరమైన మందులు ఉన్నాయా లేదా అని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షయవ్యాధి(టీబీ)కేసుల వివరాలు అడిగి ముగ్గురు టీబీ పేషెంట్లకు స్వయంగా ఫోన్‌చేసి వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీయడంతోపాటు ఆరోగ్య, వైద్యసిబ్బంది సరిగా మందులు ఇస్తున్నారా లేదా తదితర వివరాలు అడిగి వారు చెప్పిన సమాధానంతో సంతృప్తి చెందారు. అలాగే సురక్షిత ప్రసవ క్యాలెండర్ ప్రకారం ప్రతినెల గర్భిణులకు సరైన మందులు, ఆరోగ్యరక్షణపై సూచనలు ఇవ్వడంపై వైద్యసిబ్బందిని ఆరా తీశారు. హైరిస్క్ కేసులు, మలేరియా కేసుల వివరాలు, కుష్టువ్యాధి కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో నెలకు ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయని అడగగా ఒకటి లేదా రెండు ప్రసవాలు జరుగుతున్నట్లు డాక్టర్ సుజిత కలెక్టర్‌కు వివరించారు. వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల నియంత్రణలో అప్రమత్తంగా వుంటూ ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా వైద్య ఆరోగ్యసిబ్బంది పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుజిత, ఆత్కూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోహర్‌రెడ్డి, స్టాఫ్‌నర్సులు పాల్గొన్నారు.

వసతిగృహంలో విద్యార్థులకు లోటు లేకుండా చూడాలి

వసతి గృహాల్లో విద్యార్థులకు ఎటువంటి లోటు లేకుండా నిర్ణీత సమయంలో మెనూ ప్రకారం తప్పనిసరిగా భోజనసదుపాయం కల్పించాలని కలెక్టర్ డీకే బాలాజీ వసతిగృహ సంక్షేమ అధికారిని ఆదేశించారు. సోమవారం సాయంత్రం గన్నవరం మండలంలోని దావాజీగూడెం వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ వసతిగృహాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బాలికల హాజరుతోపాటు పామోలిన్ నూనె, చిక్కి తదితర పలు రకాల రిజిస్టర్లను పరిశీలించారు. నిర్ణీత మెనూ ప్రకారం ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో భోజనం సరిగా పెడుతున్నారా లేదా అని కలెక్టర్ బాలికలను విచారించారు. అందుకు వారు సరిగా పెడుతున్నారని చెప్పడంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తనిఖీలో వసతి గృహ సంక్షేమ అధికారిణి జేవీఎస్ లక్ష్మి పాల్గొన్నారు.



ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

పేరంటాలమ్మ హుండీ ఆదాయం రూ.6.60 లక్షలు

గుణదల, జూలై 8 : రామవరప్పాడులోని వెంకమ్మ పేరంటాలమ్మ హుండీ ఆదాయం రూ. 6.60 లక్షలు వచ్చిందని ఆలయ కార్యనిర్వహణ అధికారిణి పాతూరి లోకేశ్వరి తెలిపారు. వెంకమ్మ పేరంటాలమ్మ హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమం ఆలయ ప్రాంగణంలో సోమవారం జరిగింది. హుండీ ఆదాయ లెక్కింపు కార్యక్రమాన్ని దేవదాయశాఖ పర్యవేక్షణ అధికారి కొప్పిశెట్టి నాగరాజు, ఆలయ కార్యనిర్వహణ అధికారిణి పాతూరి లోకేశ్వరి, ధర్మకర్తల మండలి అధ్యక్షులు బోయిన భానుప్రదీప్ పర్యవేక్షించారు. మూడు నెలల 18 రోజుల తర్వాత హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని లెక్కించగా రూ. 6.60 లక్షల నగదు, 13 గ్రాముల బంగారు ఆభరణాలు, కేజీ 400 గ్రాముల వెండి వచ్చాయని ఆలయ కార్యనిర్వహణ అధికారిణి పాతూరి లోకేశ్వరి తెలిపారు.

రాష్ట్రాభివృద్ధే చంద్రబాబు లక్ష్యం

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్



వైవీబీకి శుభాకాంక్షలు తెలుపుతున్న పంచాయతీరాజ్ ఛాంబర్ నాయకులు

ఉయ్యూరు, జూలై 8 : రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు, పెట్టుబడులు తీసుకురావాలన్న లక్ష్యంతో ఢిల్లీ పర్యటన చేస్తుంటే.. వైసీపీ ఎమ్మెల్యే జగన్మోహన్‌రెడ్డి జైలుకు వెళ్లి జైల్లో ఉన్న పిన్నెల్లిని పరామర్శించడం సిగ్గుమాలిన చర్య అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ విమర్శించారు. కూటమి రాష్ట్రంలో అధికారంలోకి రావడం పట్ల రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ నాయకులు సోమవారం రాజేంద్రప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వ పాలన రాష్ట్రాన్ని అన్నివిధాలా అధోగతి పాలు చేసిందన్నారు. జైల్లో ఉన్న పిన్నెల్లిని పరామర్శించడమే కాక తన చర్యను సమర్థిస్తూ జగన్ ప్రెస్‌మీట్‌లో ఈవీఎంలు పగులగొట్టడం తప్పుకాదని మాట్లాడడం దౌర్భాగ్యమని, నేరాలను ప్రేరేపించేవారికి ఇది నేరంగా కన్పించదని, ప్రభుత్వం వ్యక్తిగతంగా ఎవరిపైనా కక్షసాధింపు చర్యలకు పాల్పడదన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పంచాయతీ రాజ్‌ఛాంబర్ అధ్యక్షుడు కడలి గోపాలరావు, సర్పంచ్‌ల సంఘం గౌరవ అధ్యక్షుడు పిల్లి సత్తి రాజు తదితరులు రాజేంద్రప్రసాద్‌ను కలసిన వారిలో ఉన్నారు.

విధినిర్వహణలో ప్రజల మన్ననలు పొందాలి

ఆకునూరు సర్పంచ్ గోలి వసంత్‌కుమార్



ఆకునూరు గ్రామ సచివాలయ గ్రేడ్-5 సెక్రటరీని సత్కరిస్తున్న సర్పంచ్ వసంత్‌కుమార్

ఆకునూరు(ఉయ్యూరు), జూలై 8 : కార్యాలయాలుకు వచ్చే ప్రజల సమస్యలు పరిష్కరించడం ద్వారా విధి నిర్వహణలో మన్ననలు పొందం అభినందనీయమని ఆకునూరు సర్పంచ్ గోలి వసంత్ కుమార్ అన్నారు. ఆకునూరు గ్రామసచి వాలయంలో గ్రేడ్-5 సెక్రటరీగా పనిచేసి పదోన్నతిపై పెదపారుపూడి మండలం పాములపాడు గ్రామ సచివాలయ డీడీవోగా వెళుతున్న సీహెచ్ ఉమామహేశ్వరికి సచివాలయ సిబ్బంది, ఉద్యోగులు సోమవారం వీడ్కోలు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముఖ్య అతిథిగా పాల్గొని గ్రామసచివాలయంలో సెక్రటరీగా ఉమమహేశ్వరి విశిష్ట సేవలందించారని కొనియాడారు. ఇన్‌చార్జి సెక్రటరి వెంకటసుబ్బారావు, వీఆర్వో వెంకటేశ్వరరావు, హెల్త్ సెక్రటరీ పార్వతి, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అతిసారపై అప్రమత్తత అవసరం

● స్టాప్ డయేరియాపై రంగన్నగూడెంలో అవగాహన



రంగన్నగూడెంలో స్టాప్ డయేరియాపై అవగాహన ర్యాలీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 8 : వాతావరణ మార్పులు, నీటి కాలుష్యం వల్ల డయేరియా (అతిసార) వ్యాధిన పడే ప్రమాదముందని తగు జాగ్రత్తలు వహించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఫణికుమార్ సూచించారు. రంగన్నగూడెంలో సోమవారం స్టాప్ డయేరియా, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. రోజుకు మూడు కంటే ఎక్కువ సార్లు నీళ్ల విరేచనాలు అయితే డయేరియాగా భావించి తక్షణం వైద్య సహాయం తీసుకోవాలన్నారు. పిల్లలు ఎక్కువగా డయేరియా బారినపడే ప్రమాదముంది కాబట్టి వారికి అవగాహన కల్పిస్తూ కాచి వడగట్టిన నీటిని మాత్రమే తాగాలని, భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రపరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం జాస్మిన్‌రాణి, ఎంఎల్‌హెచ్‌పీ తేజస్విని, స్కూల్ హెచ్ఎం గ్లోరీ స్వర్ణలత, నాగరాజు, నాగలలిత వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏనుగుకోడు ముంపు రైతుల ఆందోళన

అండగా ఉంటానంటూ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ హామీ



ఏనుగుకొడు వద్ద ఆందోళన చేస్తున్న గొడవర్రు రైతులు

గొడవర్రు (కంకిపాడు), జూలై 8 : తమకు న్యాయం చేయాలంటూ ఏనుగుకోడు ముంపు ప్రాంత రైతులు సోమవారం గొడవర్రు - రొయ్యూరు మధ్యలోని ఏనుగుకోడు వద్ద ఆందోళనకు దిగారు. ఏనుగుకోడు పూడుకు పోవటంతోపాటు తూడు, డెక్క పెరిగి పోవటంతో పంట పొలాల్లో నుంచి మురుగు పోయేందుకు ఆస్కారం లేకపోవడంతో నారుమళ్లు నీట మునిగి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తక్షణమే పూడికతీతతో పాటు తూడు, డెక్క తొలగింపు చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు ఉప్పులేటి రాజేష్, యార్లగడ్డ రాఘవేంద్రరావు, యలమంచిలి సాంబశివరావు, కాగిత వెంకటరమణ, దాడి శ్రీను, రొయ్యూరు రైతులు పాల్గొన్నారు.

ప్రజానాయకుడు వైఎస్సార్

● కాంగ్రెస్, వైసీపీల ఆధ్వర్యంలో వేర్వేరుగా ఘన నివాళి



హనుమాన్‌జంక్షన్, వీరవల్లిలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్, వైసీపీ నాయకులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 8 : రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిన ప్రజానాయకుడు వైఎస్ రాజశేఖరరెడ్డి అని కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఝాన్సీరాణి, ఎంపీపీ యరగొర్ల నగేష్ వేర్వేరు కార్యక్రమాల్లో కొనియాడారు. బాపులపాడు మండల వ్యాప్తంగా సోమవారం ప్రజానాయకుడు వైఎస్సార్ 75వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించి నివాళులర్పించారు. పేద ప్రజలకు కూడు, గూడు, ఉండాలనే కాంగ్రెస్ పార్టీ ధ్యేయాన్ని అమలు చేస్తూ 58లక్షలకు పైగా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించిన ఘనత వైఎస్సార్ దేనని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నండూరి శ్రీనివాసరావు అన్నారు. రేమల్లె, హనుమాన్‌జంక్షన్, మల్లవల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలపాల నాగేశ్వరరావు, చొదిమెళ్ల పండు, జింకా గౌతమబుద్ధుడు, తదితరులు పాల్గొన్నారు. హనుమాన్ జంక్షన్‌లో వైసీపీ మండల కమిటీ అధ్యక్షుడు నక్కా గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ యరగొర్ల నగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవానిలతో కలిసి భారీకేక్‌ను కట్ చేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొమరవల్లి కిరణ్‌మూర్తి, నన్నపనేని చలపతిరావు, దయాల విజయ నాయుడు పాల్గొన్నారు. పెరికీడు లోని వైఎస్సార్ విగ్రహానికి వెలగపల్లి ప్రదీప్, కోడూరు పాడులోని వైఎస్సార్ విగ్రహానికి వైస్ ఎంపీపీ చందు రమాదేవి, శ్రీనివాసరావు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య

హనుమాన్‌జంక్షన్, జూలై 8: అప్పులు బాధ తాళలేక పురుగు మందు తాగి స్థానిక ఇందిరానగర్‌కు కాలనీకి చెందిన కిమిడి ప్రసాద్(45) ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై సోమవారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై అర్జమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరానగర్‌కు చెందిన కిమిడి ప్రసాద్ కుటుంబ అవసరాలకు దాదాపు రూ.5లక్షలు అప్పులు చేశాడు. అప్పులు ఇచ్చిన వాళ్ల ఒత్తిడి తట్టుకోలేక ఈ నెల 5వ తేదీన పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడగా ప్రాణాపాయ స్థితిలో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి చికిత్స పొందుతు ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్సై తెలిపారు.

మానవత ఆర్థిక సాయం

హనుమాన్‌జంక్షన్, జూలై 8 : బ్రెయిన్ సంబంధిత వ్యాధితో ఇబ్బందిపడుతున్న వేలేరు గ్రామానికి చెందిన కొండా గాయత్రికి మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ రూ11.500లు వైద్య ఖర్చులు నిమిత్తం ఆర్థిక సాయం అందజేసింది. మానవత కార్యాలయంలో సోమవారం బాధితు రాలికి ఈ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు సమక్షంలో ఆ సంస్థ శాఖ సభ్యులు ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు నారగాని కొండలరావు, జేవీవీ.సత్యనారాయణ, చెక్కా సుబ్బారావు, అక్కినేని రాఘవేంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.55

అనర్హుల పింఛన్లు తొలగించి దివ్యాంగులకు న్యాయం చేయాలి

గుడ్లవల్లేరు : మండలంలోని చాలా గ్రామాల్లో అనర్హులు చాలా మంది వికలాంగ పింఛన్లు పొందుతూ అర్హులైన దివ్యాంగులకు అవకాశం దక్కకుండా చేస్తున్నారని టీడీపీ నాయకులు సోమవారం ఈవోపీఆర్డీ దిలీప్‌కు ఫిర్యాదు చేశారు. 2019- 24 మధ్య అనేక మంది సదరం ఫేక్ సర్టిఫికెట్లు తీసుకున్నారన్నారు. ఒకే రేషన్ కార్డుపై రెండు, మూడు పింఛన్లు పొందుతున్న వారు కూడా ఉన్నారన్నారు. అనర్హులను గుర్తించి వారి పెన్షన్ తొలగించి అర్హులైన వారికి న్యాయం చేయాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సూరపనేని పరంధామయ్య, కల్యాణపు నవాబు, సాయి భగవాన్, ఆకుల శివయ్య, రంగబాబు తదితరులు పాల్గొన్నారు.



25వ వర్ధంతి సందర్భంగా మోదుమూడి శ్రీహరిరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కె.రామకృష్ణ, జెల్లి విల్సన్, ఎం.రామారావు

భూపోరాట యోధుడు శ్రీహరిరావు

• 25వ వర్ధంతి కార్యక్రమంలో కె.రామకృష్ణ నివాళి

మచిలీపట్నం టౌన్ : పేద, బడుగు, బలహీనవర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన భూపోరాట యోధుడు మోదుమూడి శ్రీహరిరావు అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ జెల్లి విల్సన్ తదితర నాయకులు పేర్కొన్నారు. సీపీఐ నేత మోదుమూడి రామారావు ఆధ్వర్యంలో జరిగిన మోదుమూడి శ్రీహరిరావు 25వ వర్ధంతి కార్యక్రమంలో కె.రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా శ్రీహరిరావు చిత్రపటానికి వామపక్ష నాయకులు నివాళులర్పించారు. రామకృష్ణ మాట్లాడుతూ, శ్రీహరిరావు జీవితమే ఒక పోరాటమన్నారు. పోరాట యోధులకు ఆయన మార్గదర్శనమన్నారు. వక్తలు మాట్లాడుతూ, నేటి తరం నేతలు శ్రీహరిరావు నిస్వార్థ సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సీపీఐ నాయకులు వెలగపూడి ఆజాద్, నార్ల వెంకటేశ్వరరావు, లింగం ఫిలిప్, నిమ్మగడ్డ నాగేశ్వరరావు, డాక్టర్ కుప్పా రామస్వామి శాస్త్రి, సురేంద్రనాథ్ బెనర్జీ, కట్టా హేమ సుందర్, కోదాటి నారాయణ, రేటూరి అంజన పాల్గొన్నారు.

ఫుడ్‌కోర్టులో అక్రమ కట్టడాల తొలగింపు

మచిలీపట్నం టౌన్ : బైపాస్ రోడ్డులో అక్రమంగా ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్టులోని 54 దుకాణాలను సోమవారం మునిసిపల్ అధికారులు తొలగించారు. వైసీపీ నాయకుల అండదండలతో బైపాస్ రోడ్డులో పెద్ద ఎత్తున ఫుడ్ కోర్టులో దుకాణాలు ఏర్పాటు చేశారు.ఈ ఫుడ్ కోర్టుకు స్థలాలను వైసీపీ నాయకులు కొందరు అమ్ముకున్నారు. ఫుడ్ కోర్టు వద్ద మందు బాబులు ఆగడాలు శ్రుతిమించాయి. సమస్యను మంత్రి కొల్లు రవీంద్రకు ప్రజాదర్బార్‌లో వినతి పత్రాలు ఇచ్చారు. నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులకు, మునిసిపల్ కమిషనరుకు కూడా ఫిర్యాదు చేశారు. టౌన్ ప్లానింగ్ అధికారులు ఫుడ్ కోర్టులోని దుకాణాలను సోమారం తొలగించారు. ప్రజల ఫిర్యాదు మేరకు విచారణ జరిపి ఫుడ్ కోర్టులోని అక్రమ నిర్మాణాలను తొలగించినట్లు కమిషనర్ బాపిరాజు తెలిపారు.



10వ డివిజన్‌లో పారిశుధ్య పనులు చేయిస్తున్న జనసేన నేత రామకృష్ణ

పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి

మచిలీపట్నం టౌన్ : ప్రజల ఆరోగ్యం పారిశుధ్యంతో ముడిపడి ఉందని, పారిశుధ్యంపై మెరుగుపై ప్రత్యేక దృష్టి సారించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ అన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా సోమవారం 10వ డివిజన్‌లో ఎండి బాషితో కలసి పారిశుధ్య పనులను బండి రామకృష్ణ పర్యవేక్షించారు. 30 మంది పారిశుధ్య కార్మికులతో పనిచేయించారు. బండి రామకృష్ణ మాట్లాడుతూ, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగడం మంచిదన్నారు. జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, నాయకులు పినిశెట్టి వేణు, శాయన శివ, సంకుల నాని, బండి కరుణాకర్, ఈమన మణిబాబు, గంపల కృష్ణ, కె. గణేష్, పినిశెట్టి కుమారి తదితరులు పాల్గొన్నారు. పారిశుధ్య కార్మికులకు రామకృష్ణ భోజనాలు ఏర్పాటు చేశారు.



రాజేష్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న వి.వెంకటేశ్వర్లు

పేదల పక్షపాతి రాజేష్ : సీపీఎం నేతల నివాళి

గుడివాడ : పేదల పక్షాన పోరాడిన అలుపెరగని పోరాటయోధుడు మురాల రాజేష్ అని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు అన్నారు. సుందరయ్యభవన్‌లో మురాల రాజేష్ ప్రథమ వర్ధంతి సభ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రఘు అధ్యక్షతన జరిగింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భూస్వాముల బెదిరింపులకు ఏనాడు రాజేష్ భయపడలేదన్నారు. తొలుత రాజేష్ చిత్రపటానికి నివాళ్ళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు మేరమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



టిడ్కో లబ్ధిదారుల ఆందోళన

గుడివాడ : టిడ్కో కాలనీలో బ్యాంకర్ల ఆగడాలు పెచ్చుమీరాయని, టిడ్కో రుణాలను కట్టలేదని పేదలపై జులుం ప్రదర్శిస్తున్నారని టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్ష ,కార్యదర్శులు సంగమ్మ, అరుణ ఆందోళన వ్యక్తం చేశారు. టిడ్కో కాలనీలో అభివృద్ధి కమిటీ విస్తృత సమావేశం సోమవారం నిర్వహించారు. వాయిదాలను చెల్లించాలంటూ టిడ్కో లబ్దిదారులను బ్యాంకులు వేధిస్తున్నాయన్నారు. బ్యాంకర్ల వేధింపులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కమిటీ సహాయ కార్యదర్శి సయ్యద్ నూరున్నీసా, ఉపాధ్యక్షులు ఆదినారాయణ, దొడ్ల రమణమ్మ, మేరమ్మ, రంగారావు, చిన్నమ్ములు, వీరాస్వామి, బ్రహ్మయ్య, షేక్ గౌస్, హైమావతి, కన్యాకుమారి తదితరులు పాల్గొన్నారు.

పాలసంఘాల అధ్యక్షులతో మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని భేటీ

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు పాలశీతలీకరణ కేంద్రం పరిధిలో ఇటీవలే ఎన్నికైన 12 పాల సంఘాల అధ్యక్షులతో పాలశీతలీకరణ కేంద్రం కల్యాణ మండపంలో కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు సోమవారం సమావేశం నిర్వహించారు. నూతన అధ్యక్షులను అభినందించారు. సంఘాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. కృష్ణా మిల్క్ యూనియన్ పాలకవర్గ సభ్యులు అర్జా నగేష్, వల్లభనేని భాస్కర కుటుంబ వెంకట సుబ్బారావు, గుడ్లవల్లేరు పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ తోట సత్య నారాయణ పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు ధీటుగా ఫలితాలు సాధించాలి

మోపిదేవి : కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నత ఫలితాలు సాధించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లిఖార్జునరావు అన్నారు. కెకొత్తపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ చేశారు. పదవ తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆయన సత్కరించారు. సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు చందన రంగారావు, ప్రధానోపాధ్యాయులు వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



పీహెచ్‌సీలో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా



చల్లపల్లి గురుకుల పాఠశాలలో బోరు ఏర్పాటు

పట్టిసీమ నీటితో చెరువులు నింపుకోవాలి

అవనిగడ్డ, జూలై 8 : పట్టిసీమ నీటితో ముందుగా నియోజకవర్గంలోని అన్ని గ్రామపంచాయతీల తాగునీటి చెరువులు నింపుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. నియోజకవర్గంలోని సర్పంచ్‌లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో తాగునీటిపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సర్పంచ్‌లు ప్రత్యేక చొరవ తీసుకుని ముం దుగా చెరువులు నింపుకోవాలన్నారు. అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విస్తృత సమీక్షలతో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పవన్ కల్యాణ్ సహకారంతో నియోజకవర్గంలోని తాగునీరు, రహదారుల సమస్య పరిష్కరిస్తామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పి.సత్యనారాయణ, ఏఈఈలు ప్రకాష్, జగత్, కిషోర్ బాబు, బ్రహ్మయ్య, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

అవనిగడ్డ : క్రమశిక్షణ, స్వయం కృషితో విద్యార్థులు ఎదగాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆకాంక్షించారు. అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంప్యూటర్ ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ప్రారంభించారు. డాక్టరేట్ పొందిన ఏ.వీరకుమారిని ఘనంగా సన్మానం చేశారు. కళాశాల విద్యార్థులు నిర్వహిస్తున్న దివిసీమ దివిటీలు తాజా సంచికను బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. విద్యార్థులు, అధ్యాపకులు ఆయనను ఘనంగా సత్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ రాజనాల అంకారావు, ఐక్యూఏఈ కో-ఆర్డినేటర్ పి.బి. సంధ్యశ్రీ, ఎకనామిక్స్ అధ్యాపకురాలు వీరకుమారి, ఆంగ్ల విభాగం ఇన్‌చార్జ్ జి.మణిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బుద్ధప్రసాద్‌కు ఉపాధ్యాయుల సత్కారం

అవనిగడ్డ : ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సింహాద్రి రవీంద్రబాబు, ఉపాధ్యాయులు సోమవారం సాయంత్రం వారి స్వగృహంలో ఘనంగా సత్కరించారు. అవనిగడ్డ నియోజకవర్గం నుంచి నాలుగోసారి అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

మెరుగైన వైద్యసేవలకు కృషి

కూచిపూడి : ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. మొవ్వ పీహెచ్‌సీ ఆవరణలో కేంద్ర నిధులు రూ.50 లక్షలతో నిర్మించనున్న పబ్లిక్ హెల్త్ యూనిట్ బ్లాక్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. మండల వైద్యాధికారి డాక్టర్ వేదరాజ్, లింగమనేని రామలింగేశ్వరరావు, మండవ రత్నగిరిరావు, మండవ శ్రీకృష్ణ, తాతినేని పూర్ణచంద్రరావు, వీరంకి తులసీదాస్, మండవ కోటేశ్వరరావు, ఈడే నాగేశ్వరరావు, తహసీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మీ, ఎంపీడీవో చంద్రశేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు.

అభిమాని కోరిక నెరవేర్చిన ఎమ్మెల్యే కుమార్ రాజా



పెదపారుపూడి : వర్ల కుమార్ రాజాకు జూన్ 26వ తేదీన పుట్టిన రోజు గిఫ్ట్‌గా పామర్రు ఎమ్మెల్యే నేమ్ ప్లేట్ ఇవ్వాలని భావించి దానిని తయారు చేయించిన జువ్వనపూడికి చెందిన తోట రమేష్ (34) జూన్ 24న అకాల మరణం చెందాడు. రమేష్ పెద్ద కర్మ కార్యక్రమానికి వచ్చిన కుమార్ రాజాకు ఆయన భార్య శివనాగమల్లేశ్వరి, పిల్లలు సోమవారం నేమ్ ప్లేట్ అందజేశారు. నేమ్ ప్లేట్ తయారు చేసి అందించకుండానే రమేష్ చనిపోవటం చాలా బాధాకరం అన్నారు. అతని ఆత్మ శాంతించాలని కోరుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి, గుండపనేని శ్రీనివాసరావు, గోగం రామారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ చొరవతో తాగునీటి సమస్యకు పరిష్కారం

చల్లపల్లి : అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చొరవతో చల్లపల్లి గురుకుల బాలికల పాఠశాల/కళాశాల తాగునీటి సమస్య పరిష్కారమైంది. బాలికలకు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న బుద్ధప్రసాద్‌కు తాగునీటి సమస్యను ప్రిన్సిపాల్ వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ గ్రామపంచాయతీ ద్వారా నూతన బోరు ఏర్పాటు చేసి తాగునీటి సమస్య పరిష్కరించాల్సిందిగా సూచించారు. దీంతో చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, కార్యదర్శి పివి.మాధవేంద్రరావుల ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. నూతన బోరును ఏర్పాటు చేసి తాగునీటి వనరును పునరుద్ధరించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే మండలికి, సర్పంచ్, ఈవోలకు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి.అరుణకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థినికి అస్వస్థత



• పత్తాలేని 108 వాహనం
• రేపల్లె ఆసుపత్రికి తరలింపు
• విషమంగా విద్యార్థిని పరిస్థితి

కోడూరు, జూలై 8 : కోడూరు శివారు స్వతంత్రపురం జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న బాలిక అస్వస్థతకు గురైంది. సోమవారం యథావిధిగా పాఠశాలకు బాలిక చిలకల దివ్య శ్రీ (14) పాఠశాలకు వెళ్లగా, ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోయింది. కోడూరు పీహెచ్‌సీకి తరలించగా డాక్టర్ ఫాతిమ ఆక్సిజన్ లెవల్స్ పడిపోయాయని చెప్పారు. ప్రాథమిక చికిత్స అనంతరం అవనిగడ్డ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. బాలిక తల్లిదండ్రులు 108కు ఫోన్ చేయగా, సమయానికి రాకపోవడంతో ప్రైవేట్ వాహనంలో రేపల్లెలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బాలిక పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. 108 వాహనం అందుబాటులోకి రాకపోవడం వల్లే ఈ పరిస్థితి ఎదురైందని తల్లిదండ్రులు తెలిపారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు

అవనిగడ్డ రూరల్ : అవనిగడ్డ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు సమావేశ మందిరంలో జరుగుతుందని ఎంపీడీవో మరి య కుమారి తెలిపారు. ఎంపీపీ తుంగల సుమతి దేవి అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరు కావాలన్నారు.

కృతజ్ఞతా సభ 12న

అవనిగడ్డ : ఈనెల 12వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు గాంధీక్షేత్రంలో జరిగే కృతజ్ఞతా సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ కోరారు. ఎంపీగా వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యేగా తాను ఎన్నికైన సందర్భంగా నియోజకవర్గ ఓటర్లకు ధన్యవాదాలు తెలిపేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. వెంకట్రామ్, పాపారావు, వేణుగోపాలరావు పాల్గొన్నారు.

నాంచారమ్మకు మొక్కు చెల్లించిన వెంకట్రామ్

అవనిగడ్డ రూరల్ : దక్షిణ చిరువోలు లంక గ్రామంలోని నాంచారమ్మ అమ్మవారిని జనసేన నాయకులు మండలి వెంకట్రామ్ దర్శించుకుని పూజలు చేశారు. కూటమి టిక్కెట్ మండలి బుద్ధప్రసాద్‌కు రావాలని, ఆయన అత్యధిక మెజార్టీతో ఘన విజయం సాధించాలని దక్షిణ చిరువోలు లంక గ్రామ కూటమి నాయకులు చేసిన మొక్కులను తీర్చుకున్నారు. మండలి వెంకట్రామ్ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్ రాజశేఖరరెడ్డికి ఘన నివాళి



వైఎస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కైలే

మచిలీపట్నం టౌన్ : మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి ముందుచూపు అందరికీ ఆదర్శమని కాంగ్రెస్ నాయకుడు అబ్దుల్ మతీన్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజశేఖరరెడ్డి చిత్రపటానికి కోకా ఫణిభూషణ్, ఎన్. కుమారి, పేరిశెట్టి నాగరాజు, సయ్యద్ నూరుద్దీన్, రహ్మతున్నీసా, శామ్యూల్ తదితరులు నివాళులర్పించారు. **కూచిపూడి :** వైఎస్ఆర్ ఆశయాలకనుగుణంగా పని చేస్తామని మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పేర్కొన్నారు. మొవ్వ, కూచిపూడి గ్రామాల్లో వైఎస్ఆర్ 75వ జయంతిని ఘనంగా నిర్వహించారు. అనిల్ కుమార్ వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొండేటి ఇందిర, రాజులపాటి రాఘవరావు, సమ్మెట ఆంజనేయులు, కొండవీటి విజయలక్ష్మి, కొండవీటి అమర బాలేశ్వరరావు, డొక్కు కృష్ణ, దాసరి శ్రీనివాసరావు, రాజులపాటి మురళీ పాల్గొన్నారు. **పామర్రు :** వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. వైఎస్సాఆర్ విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఘనంగా నివాళులర్పించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **నాగాయలంక :** సాయిబాబా గుడి సెంటర్‌లో వై.ఎస్ విగ్రహానికి వైసీపీ నేతలు భోగాది శేషగిరిరావు, బీసాబత్తిన ప్రసాద్ నివాళులర్పించారు. **అవనిగడ్డ రూరల్:** వేకనూరు వంతెన సెంటర్‌లో గుడివాక శివరావు ఆధ్వర్యంలో రాజశేఖర్ రెడ్డి జయంతి నిర్వహించారు. **పెదపారుపూడి :** పెదపారుపూడిలో రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కైలే నివాళులర్పించారు. ఎంపీపీ గోగం సురేష్, ఆల రమేష్, జాజుల చిన్నారి, తుమ్మల కోటేశ్వరరావు పాల్గొన్నారు. **పెడన :** వైసీపీ ఆధ్వర్యంలో మాజీ సీఎం వై.ఎస్. రాజశేఖరరెడ్డి 75వ జయంతిని సోమవారం పట్టణంలో నిర్వహించారు. వైసీపీ పెడన నియోజకవర్గ సమన్వయకర్త ఉప్పాల రాము వైసీపీ కార్యాలయంలో వైఎస్ చిత్రపటానికి, బస్టాండ్, తోటమూల, రామరాజుపాలెం కాలువ సెంటర్లలోని వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బంటుమిల్లి రోడ్డు సెంటర్‌లోని వైఎస్ విగ్రహానికి వైసీపీ నాయకులు బందారు మల్లిఖార్జునరావు, బళ్ళ గంగయ్య, మజీద్ తదితరులు నివాళులర్పించారు.

అక్రమ నిర్మాణాలకు నోటీసులివ్వాలి

పెడన : అనుమతులు లేని అక్రమనిర్మాణాల యజమానులకు నోటీసులు జారీ చేయాలని మునిసిపల్ కమిషనర్ బి. వెంకట్రామయ్య సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీలను ఆదేశించారు. సోమవారం ఆయన పురపాలక సంఘ కార్యాలయంలో ప్లానింగ్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు నోటీసులు జారీ చేసిన అనంతరం జరిమానా విధించాలని సూచించారు. టీపీవో ఏసుబాబు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ జితేంద్ర పాల్గొన్నారు.

యాళ్లమ్మకు సారె సమర్పణ

అవనిగడ్డ రూరల్ : మోదుమూడిలో యాళ్లమ్మ అమ్మవారికి సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఆషాఢ సారె సమర్పించారు. మోదుమూడి, రామచంద్రాపురం తదితర గ్రామాల మహిళలు ఆషాఢ సారె అందజేశారు. సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ వెంకటేశ్వరరావు, మహిళ కన్వీనర్ శ్రీరావమ్మా, రామలక్ష్మి, వెంకటేశ్వరమ్మ, పద్మజ, సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ సీతారాం, ఆలయ నిర్వాహకుడు మత్తి ఆంజనేయులు పాల్గొన్నారు.

విజేతలకు విక్కుర్తి బహుమతులు

అవనిగడ్డ : జడ్పీ హైస్కూల్ నందు హెచ్ఎం సింహాద్రి రవీంద్ర బాబు ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోకాల కంఠస్థ, సామూహిక పఠన పోటీలు నిర్వహించగా, ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రముఖ పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాస్ మొదటి బహుమతి రూ.1000, రెండవ బహుమతిగా రూ.500, మూడవ బహుమతి రూ.500, బాలబాలికలకు 200 మందికి, నోటుపుస్తకాలు, పెన్నులు అందజేశారు. భగవద్గీత శిక్షణా కార్యక్రమాన్ని మత్తి శేషగిరిరావుచే నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

150 మందికి వైద్యపరీక్షలు

పమిడిముక్కల : ధీరజ్ హాస్పిటల్, లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మేడూరులో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 150 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆసుపత్రి అధినేత డాక్టర్ డి.కుశాల్‌ధీరజ్, ఇతర విభాగాల డాక్టర్లు వైద్యపరీక్షలు చేశారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధి గంగాధర్ తదితరులు పాల్గొని సేవలందించారు.

డయేరియాను పారదోలుదాం

పెదపారుపూడి : పరిశుభ్రతతో డయేరియాను పారదోలుదామని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. వెంట్రప్రగడ గ్రామం పులవర్తిగూడెంలో స్టాప్ డయేరియా స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని అధికారులతో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. వర్ల కుమార్ రాజా పులవర్తిగూడెంలో రోడ్లను శుభ్రం చేసి డ్రైనేజీలు వెంట బ్లీచింగ్ పౌడర్ చల్లారు. చలసాని రమేష్ చౌదరి, ఆశాజ్యోతి, సూరపనేని వెంకట సత్యనారాయణ, పునుకొల్లు వెంకట రత్న ప్రసాద్, చప్పిడి కిషోర్ పాల్గొన్నారు.

గంజాయి సమాచారమిస్తే నజరానా

కోడూరు : మండలంలో గంజాయి విక్రయాల సమాచారం తెలియపర్చిన వారికి రూ. 5 వేల నగదు బహుమతి అందజేస్తామని కోడూరు ఎస్సై పి.శిరీష తెలిపారు. కోడూరులో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయని సోషల్ మీడియాల్లో కథనాలు వస్తున్నాయన్నారు. ఇప్పటి వరకు గంజాయి అమ్మకాల సమాచారం తన దృష్టికి రాలేదన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు, మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.

విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం

నాగాయలంక : అవనిగడ్డ సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహంలో పదవ తరగతి చదివిన గుంటూరు పూజిత 507 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. మాజీ సైనికోద్యోగి గొరుముచ్చు బాబురావు సతీమణి దివంగత కోటేశ్వరమ్మ ఫౌండేషన్ తరపున రూ.11 వేలు ప్రోత్సాహక నగదును సోమవారం అందజేశారు. వసతిగృహం సంరక్షకురాలు రేపల్లె అనురాధ, పెదసింగు బాఉబరావు, విశ్రాంత సంరక్షకుడు పి.స్టాలన్ రాజు, గుంటూరు సంపూర్ణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బొడ్డపాడులో రైతుసేవా కేంద్రం ప్రారంభం

తోట్లవల్లూరు : బొడ్డపాడులో రైతుసేవా కేంద్రాన్ని మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్, గ్రామ సర్పంచ్ మూడే శివశంకర్ ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వంలో బొడ్డపాడులో ఉండాల్సిన కేంద్రాన్ని చినపులిపాకలో ఏర్పాటు చేశారు. సర్పంచ్ శివశంకర్ చొరవ తీసుకుని బొడ్డపాడులో రైతు సేవా కేంద్రం పేరుతో ఏర్పాటు చేశారు.